క్లుప్తంగా

ట్రాఫిక్ ఏసీపీగా రామచంద్రరావు

విజయవాడస్పోర్ట్స్: వన్‌టౌన్ ట్రాఫిక్ ఏసీపీగా పి.రామచంద్రరావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా వెయిటింగ్‌లో ఉన్న ఆయన్ను ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లాకు కేటాయించింది. ఏసీపీగా బాధ్యతలు తీసుకున్న అనంతరం కమిషనరేట్‌లో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

26 మంది ఆర్పీఎఫ్ సిబ్బంది రక్తదానం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆర్పీఎఫ్ రైజింగ్ డే పురస్కరించుకుని విజయవాడ డివిజన్ ఆర్పీఎఫ్ సిబ్బంది 26 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రైల్వే హాస్పటల్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం జరిగింది. సీనియర్ డీఎస్‌సీ వల్లేశ్వర బి.టి, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ మధుసూదనరావు రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షించారు. అనంతరం సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల, ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిటీ హెడ్ సత్యనారాయణ దాతలను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.

దుర్గమ్మ చెంత భక్తిరంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నెల్లూరుకు చెందిన భారతీ సంగీత విద్యాలయానికి చెందిన పలువురు కళాకారులు కర్ణాటక గాత్ర సంగీతాన్ని ఆలపించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శుక్రవారం సాయంత్రం జరిగిన సంగీత విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పలు కీర్తనలను కళాకారుల బృందం చక్కటి గాత్రంతో ఆలపించారు. అనంతరం కళాకారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

టూరిజంలో విస్తృత ఉపాధి అవకాశాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): టూరిజంలో ఉపాధి అవకాశాలు అపారంగా ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం చరిత్ర విభాగం ఆధ్వర్యాన ప్రపంచ టూరిజం డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె టూరిజం ప్రాముఖ్యాన్ని వివరించారు. అధ్యాపకులు డాక్టర్ ప్రకాశం, డాక్టర్ ఎం.హరిప్రసాద్ టూరిజంలో అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బీఓఐ ప్రత్యేక 400 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): బ్యాంక్ ఆఫ్ ఇండియా పండుగ సీజన్ పురస్కరించుకుని ప్రత్యేక 400 రోజుల ఫిక్స్ డ్ డిపాజిట్‌ను ఏడాదికి 8.10 శాతం వడ్డీతో అందిస్తుందని బ్యాంక్ జోనల్ మేనేజర్ ముత్తా వీవీ బంగార్రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.3.00 కోట్ల కంటే తక్కువ బకెట్‌లో ప్రత్యేక 400 రోజుల రిటైల్ టర్మ్ డిపాజిట్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. సూపర్ సీనియర్ల కోసం ఆకర్షణీయమైన వడ్డీ 8.10శాతం, సీనియర్ సిటిజన్‌లకు 7.95శాతం, ఇతర కస్టమర్‌లకు 7.45శాతం వడ్డీ అందిస్తారని తెలిపారు. ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ అన్ని బీఓఐ శాఖల్లో ఈనెల 27వ తేదీ శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. మరింత సమాచారానికి బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిల్లో స్వయంగాగానీ, బీఓఐ ఓమ్ని నియో యాప్ ద్వారా కానీ పొందవచ్చని ఆయన తెలిపారు.

వైఎస్సార్ కాలనీలో బాధితులకు ఆహార పొట్లాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు ముంపు ప్రాంతం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని బాధితులకు నోవా హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ శుక్రవారం ఆహార పొట్లాలను అందజేసింది. సంస్థ ప్రెసిడెంట్ పల్లెపోగు సలోమి ప్రసాద్ కాలనీలో మునిగిపోయిన ఫ్లాట్లకు వెళ్లి బాధితులను పరామర్శించి వారికి భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ తమలాంటి స్వచ్ఛంద సేవా సంస్థలు అండగా ఉంటాయని చెప్పారు.

● ఉత్సాహంగా బృందగాన పోటీలు





విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఏటా జాతీయ బృందగాన పోటీలను నిర్వహిస్తున్నామని భారత్ వికాస్ పరిషత్ విజయవాడ బ్రాంచ్ ఛైర్మన్ తేలప్రోలు వీరయ్యగుప్తా తెలిపారు. స్థానిక పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో భారత్ వికాష్ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బృందగాన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పరిషత్ కార్యక్రమాల ఛైర్మన్ ఎంవీఎస్ఎన్‌వీ.ప్రసాద్, కో ఛైర్మన్లు కిషోర్‌కుమార్ జైన్, కోనేరు మధు, విజయవాడ బ్రాంచ్ కార్యదర్శి కె.కృష్ణమూర్తి, ఫైనాన్స్ సెక్రటరీ కె.బ్రహ్మానందం, అమరావతి ప్రాంత అధ్యక్షుడు షా రూప్‌చంద్ జైన్ తదితరులు పాల్గొన్నారు. పోటీలకు జిల్లాలోని 21పాఠశాలల నుంచి 400 మంది విద్యార్థులు హాజరై దేశభక్తి గీతాలను ఆలపించారు.

–మొగల్రాజపురం(విజయవాడ తూర్పు)

కృష్ణానదిలోకి కలుషిత నీరు

నిర్ధారించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు

పెనమలూరు: విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి కలుషిత నీరు పవిత్ర కృష్ణానదిలోకి వదులుతున్నారని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నిర్ధారిస్తూ గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదిక ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి రామలింగేశ్వరనగర్‌లో 20 ఎంఎల్‌డీ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఉంది. ఈ ప్లాంట్‌లో మురుగునీరు శుద్ధి చేసి అనంతరం వృథా నీటిని కృష్ణానదిలోకి నేరుగా వదులుతున్నారు. అయితే సీవేజ్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ కారణంగా ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న స్థానిక నివాసితులు ఆందోళన చెందుతున్నారు. నదిలోకి వ్యర్థాలతో ఉన్న నీరు ప్లాంట్ నుంచి విడుదల చేయడంతో భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి విడుదల అవుతున్న వ్యర్థాలతో ఉన్న నీటిలో దిగిన పలు పాడి గేదెలు కూడా మృత్యువాత పడ్డాయి. దీంతో గ్రామానికి చెందిన వెలగపూడి బాబూరావు గ్రీన్ ట్రిబ్యునల్‌లో(ఎన్‌జీటీ) కేసు వేశారు. దీనిపై ఎన్‌జీటీ వాస్తవాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఏపీ కంట్రోల్ బోర్డును ఆదేశించింది. గత ఆగస్టు 9వ తేదీన ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను తనిఖీ చేసి శాంపిల్స్ తీశారు. ఎనాలసిస్ నివేదిక ప్రకారం సీవేజ్ ప్లాంట్ నుంచి విడుదలవుతున్న నీటిలో ఉండాల్సిన ప్రమాణాల కన్నా టోటల్ డిస్సాల్వ్‌డ్ సాలిడ్స్(టీడీఎస్)బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడి) ఎక్కువగా ఉన్నాయని గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదిక సమర్పించారు. ఈ వ్యవహారంపై గ్రీన్ ట్రిబ్యునల్ ఇవ్వనున్న తుది ఆదేశాలపై స్థానికులు ఎదురుచూస్తున్నారు.



సీవేజ్‌ప్లాంట్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు(ఫైల్)

నైపుణ్యం పెంపుతో విజయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు వ్యాపార రంగంలో రాణించాలంటే అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎపెక్స్ సెల్యూషన్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.నరేంద్రకుమార్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో మీట్‌ది సీఈవో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నరేంద్రకుమార్‌తో ముఖాముఖి జరిగింది. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు రాణించాలంటే ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యాలను కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచి సమస్యలను పరిష్కరించే చొరవ, ఆలోచనా విధానాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఒకటి రెండు అపజయాలు ఎదురైనా ధైర్యంగా వాటిని ఎదుర్కొని ముందడుగు వేయాలని చెప్పారు. సంపూర్ణ జ్ఞానం పెంచుకుంటే విజయాలు వరిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు వ్యాపార, వాణిజ్య రంగాల్లో రాణించే దిశగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేష్, విభాగాధిపతి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేంద్రకుమార్

విద్యార్థులు వివిధ రంగాల్లో పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమ తమ రంగాల్లో పట్టు సాధించాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి అన్నారు. ఆ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా గుంటూరు జిల్లా జోకిపల్రులోని జోసియల్ లిమిటెడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా టూర్‌ను ప్రారంభించిన డాక్టర్ పతంజలిశాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామికరంగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆ రంగంలో ఆయా వస్తువుల ఉత్పత్తికి అవసరమయ్యే ప్రక్రియలు తమ కోర్సులకు అనుబంధంగా ఉండే అంశాలను తెలుసుకొని పట్టు సాధించాలని సూచించారు. అనంతరం కంపెనీలోని అంశాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డీడీవీ ప్రసాద్, అధ్యాపకులు వంశీకృష్ణ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



కంపెనీని పరిశీలిస్తున్న విద్యార్థులు

3 నుంచి విజయదుర్గ ఆలయంలో దసరా ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి పేర్కొన్నారు. 3వ తేదీ గురువారం ఉదయం 8.01 గంటలకు గణపతి పూజ, కలశస్థాపన అనంతరం కుంకుమ పూజ జరుగుతుందని తెలిపారు. ఉత్సవాల్లో తొలి రోజున అమ్మవారు విజయదుర్గా దేవిగా, 4న శ్రీగాయత్రిదేవిగా, 5న శ్రీఅన్నపూర్ణాదేవిగా, 6న శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా, 7న పార్వతీ దేవిగా, 8న శ్రీమహాలక్ష్మీదేవిగా, 9న మూలా నక్షత్రం శ్రీసరస్వతిదేవిగా, 10న శ్రీదుర్గాదేవిగా, 11న శ్రీమహిషాసురమర్దినిదేవిగా, 12న శ్రీరాజ రాజేశ్వరిదేవిగా అమ్మవారిని అలంకరించనున్నారని పేర్కొన్నారు. 12వ తేదీ ఉదయం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీహోమం, అనంతరం పూర్ణాహుతి జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 8 గంటలకు శమీపూజతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని పేర్కొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచితంగా స్టడీమెటీరియల్ అందజేత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సమాజంలో కుల వివక్షకు వ్యతిరేకంగా గొంతు విప్పడంతో పాటుగా తన కవితల ద్వారా వివక్షపై పోరాడిన వ్యక్తి గుర్రం జాషువా అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్ సమీపంలో ఉన్న పూలే అంబేడ్కర్ భవన్‌లో గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో టెట్, డీఎస్సీ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేసే కార్యక్రమం శుక్రవారం జరిగింది. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, డాక్టర్ అంజయ్య, సంపర శ్రీనివాస్, దస్తగిరితో పాటుగా కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివి

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ హౌసింగ్‌బోర్డ్ కాలనీ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని హెచ్ ఐజీలు, ఎల్ఐసీ కార్యాలయం, రిలయన్స్ ఫ్రెష్ ప్రాంతాల్లో పైన పేర్కొన్న సమయాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు.

జగన్ తిరుమలకు వెళితే బాబుకు వచ్చిన ఇబ్బంది ఏమిటి

పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల తిరుపతి దర్శనానికి వెళితే ముఖ్యమంత్రి చంద్రబాబుకు వచ్చిన ఇబ్బంది ఏమిటని శుక్రవారం ఒక ప్రకటనలో వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలకు వెళ్తుంది శ్రీవారి దర్శనానికి మాత్రమేనని, ధర్నాకు కాదని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా జగన్ ప్రజా సంకల్ప యాత్ర పూర్తి చేసి తిరుమల ఆలయ దర్శనం చేసుకున్నారని, ఆ సమయంలో ఎటువంటి డిక్లరేషన్ అడగలేదన్నారు. ప్రధానమంత్రి మోదీతో, హోంమంత్రి అమిత్ షాతో జగన్ దర్శనం చేసుకున్నప్పుడు ఎవరూ డిక్లరేషన్‌ను ప్రస్తావించలేదన్నారు. ఈ విషయాన్ని పురందరేశ్వరి ఆ సమయంలో ఎందుకు మాట్లాడలేదని ఆమె ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు.

క్రీడలపై అవగాహనతో నిర్ణయాలు తీసుకోండి

సీఎం చంద్రబాబుకు సీనియర్ క్రీడాకారుడు కేపీ రావు సూచన

విజయవాడస్పోర్ట్స్: క్రీడలపై పూర్తిగా అవగాహన లేని అధికారుల నివేదికల ఆధారంగా క్రీడాభివృద్ధిపై నిర్ణయాలు తీసుకోవద్దని సీఎం చంద్రబాబుకు సీనియర్ క్రీడాకారుడు కేపీ రావు సూచించారు. ఈ నెల 26వ తేదీన క్రీడా శాఖపై జరిగిన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను పునరాలోచించాలని కోరుతూ సీఎంకు శుక్రవారం లేఖ రాశారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఇండోర్ స్టేడియంలను ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులు ఆక్రమించేశారని, వారంతా వ్యాయామం కోసం వాటిని వినియోగించుకుంటూ.. క్రీడాకారులను రానివ్వడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో మరో 35 ఇండోర్ స్టేడియంలను నిర్మించడానికి రూ.23 కోట్లు మంజూరు చేయడం వృథా అని అభిప్రాయపడ్డారు. ఈ నగదును గ్రామీణ క్రీడల అభ్యున్నతికి ఉపయోగించాలని సూచించారు. 2019లో ఇదే తరహాలో నిర్ణయాలు తీసుకుని అబాసుపాలైన వైనాన్ని గుర్తుకు తెచ్చుకోవాలని సీఎంకు సూచించారు. అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు, సీనియర్ క్రీడాకారులతో చర్చలు జరిపి క్రీడల అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. ఆర్థిక భారం పడకుండా పీపీపీ విధానంలో క్రీడలను అభివృద్ధి చేయడానికి ఆలోచన చేయాలని సూచించారు.

నేడు గుర్రం జాషువా జయంతి సభ

విజయవాడ కల్చరల్: ఏపీ సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో కవి కోకిల గుర్రం జాషువా 129 జయంతి సభను ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఈ నెల 28వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలోతెలిపారు. 2024 సంవత్సరానికి పలువురు కవులకు జాషువా పేరిట నగదు పురస్కారం, సత్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పీఏసీ సభ్యుడిగా వెలంపల్లి నియామకంపై హర్షం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) మెంబర్‌గా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు నియామకంపై ఆ పార్టీ ఎస్సీ నాయకులు పొదిలి చంటిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే తీవ్ర ప్రజా వ్యతిరేకత తెచ్చుకున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, వారిని చైతన్యవంతులను చేయాలని వెలంపల్లిని కోరారు.

కొత్తపేట పీఎస్ ఎదుట దుకాణంలో చోరీ

కౌంటర్‌లోని నగదు మాయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఫ్యాన్సీ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం కొత్తపేట వాగు సెంటర్‌లోని బూస్టర్ ప్రాంతానికి చెందిన దుర్గారావు పోలీస్‌స్టేషన్ ఎదుట ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తుంటాడు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో దుర్గారావు దుకాణాన్ని మూసి ఇంటికెళ్లాడు. గురువారం ఉదయం షాపునకు వచ్చి చూసే సరికి వెనుక వైపు ఉన్న తలుపులు తెరిచి ఉండటంతో ఆందోళన చెందాడు.

షాపులోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించాడని గమనించి కౌంటర్‌ను పరిశీలించగా ముందు రోజు అమ్మకం తాలుకా నగదు సుమారు రూ. 75 వేల వరకు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఘటనపై కొత్తపేట పోలీసులకు సమాచారం ఇచ్చాడు. షాపులో ఉన్న సీసీ కెమెరాలను ఆఫ్ చేసి మరీ నిందితుడు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. స్టేషన్ బయట ఉన్న సీసీ కెమెరాలో షాపు పక్కనే ఉన్న వీధిలోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశిస్తున్నట్లు పుటేజీలో రికార్డైంది. దీంతో నిందితుడిని గుర్తించే పనిలో పోలీసులు చర్యలు చేపట్టారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వగా, ఎటువంటి కేసు నమోదు చేయలేదని తెలుస్తోంది.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహాత్మా గాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో పని చేస్తూ ఇటీవల సంభవించిన వరద విపత్తులో ముంపునకు గురై ఇబ్బందులు పడిన పారిశుద్ధ్య కార్మికులకు రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి సెక్రటరీ మద్దాలి శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. శుక్రవారం కాంప్లెక్స్‌లోని ఆయన షాపు (234) వద్ద నిత్యావసర సరుకులతోకూడిన కిట్లను అందజేశారు. శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ వరద కారణంగా తీవ్రంగా నష్టపోయిన అనేక కుటుంబాల్లో పారిశుద్ధ్య కార్మి కులు కూడా ఉన్నారని తెలిపారు. వారిని ఆదుకోవడం సామాజిక బాధ్యతగా భావించి గొల్లపూడి రోటరీ క్లబ్ తరఫున సాయం అందించామని తెలిపారు. సాధారణ రోజుల్లోనేకాక విపత్తు సమయాల్లోకూడా వారు చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. ప్రధానంగా కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు నిరుపమానమని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ ముట్లూరు దుర్గారావు, సభ్యులు పాల్గొన్నారు.



కిట్లను అందిస్తున్న క్లబ్ సభ్యులు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వివిధ బాషలను అధ్యయనం చేయడంతో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించవచ్చని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర కార్యాలయం (ముంబై) అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వివేకానంద్ అన్నారు. హిందీ ప్రచారసభ హైదరాబాద్ ఆధ్వర్యాన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో శుక్రవారం హిందీ భాషా ప్రాంతాల నుంచి పనిచేస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు, ఉద్యోగులకు ప్రాంతీయ భాషకు తెలుగులో ప్రావీణ్యత పొందడానికి శిక్షణ తరగతులను ప్రారంభించారు. సభకు హిందీ ప్రచారసభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్ కవ్‌డే, జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి, పరీక్షా సంచాలకులు ప్రొఫెసర్ సురేష్ పురీ, కన్వీనర్, శృతికాంత్ భారతి, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, విజయవాడ జోనల్ కార్యాలయం అధికారి సి.వి.ఎస్. భాస్కర్‌రావు తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాచీన తెలుగు భాష ఎంతో గొప్పదన్నారు. హిందీ భాషా ప్రాంతాల నుంచి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి, తెలుగు భాష అనర్గళంగా మాట్లాడటానికి తరగతులు చాలా బాగా ఉపయోగపడతాయన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోనల్ కార్యాలయం పరిధిలోని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు వివేక్ సుధతో పాటు అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



తరగతులు ప్రారంభిస్తున్న బ్యాంక్ అధికారులు

ట్రస్ట్ సేవలు వినియోగించుకోండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): గొల్లాస్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చి ట్రస్ట్ సేవలను వినియోగించుకుని జీవితంలో లక్ష్యాలు చేరుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గొల్లాస్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిరుపేద, అనారోగ్య, మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేశారు. మేనేజింగ్ ట్రస్టీ గొల్లా హనుమాన్‌గుప్తాతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులు తమ కళాశాలతో పాటు ప్రభుత్వ ఐటీఐ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 21 మంది మెరిట్ విద్యార్థులకు రూ. 2.10లక్షలు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. సిద్ధార్థ మహిళా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఏటా ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులను గుర్తించి వారికి స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐ.టి.ఐ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు ఎం.కనకారావు డాక్టర్ ఎం.విజయసారథి, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ యుగంధర్ ట్రస్టీలు జి.విజయశ్రీ గుప్తా, మాటూరు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

వరద.. వాటర్ బాటిళ్లు పక్కదారి!

- తెలుగు తమ్ముళ్ల చేతివాటం!
- రాణిగారితోటలో చర్చనీయాంశంగా లారీ వాటర్ బాటిళ్ల అమ్మకం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: వరద బాధితులకు పంచాల్సిన వాటర్ బాటిళ్లు పక్కదారి పట్టాయి. వాటిని కొందరు తెలుగు తమ్ముళ్లు అమ్ముకున్నట్టు రాణిగారితోటలో వెలుగులోకి వచ్చింది. లారీ వాటర్ బాటిళ్లను ఆటోలకు లోడ్ చేస్తుండగా ప్రత్యక్షంగా చూసిన వ్యక్తి గురువారం రాత్రి మద్యం మత్తులో వీరంగం చేశాడు. ఆ సమయంలో విస్తుపోయే నిజాలు బహిర్గతం చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల మొదటి వారంలో కృష్ణానదికి వరదలు వచ్చాయి. రాణిగారితోటలోని కరకట్ట దిగువ ప్రాంతమైన తారకరామనగర్ నీటమునిగింది. వరద బాధితులకు ప్రభుత్వం స్థానిక కల్యాణ మండపంలో పునరావాసం కల్పించారు. ఈ నేపథ్యంలో వరద బాధితులకు పంచడానికి అధికారులు లారీల ద్వారా వాటర్ బాటిళ్లు, ఇతర ఆహార పదార్థాలను మండపానికి తరలించారు. వీటితో పాటు నిత్యం పాలను కూడా సరఫరా చేశారు. ఈ క్రమంలో ఒక రోజు రెండు లారీల్లో వాటర్ బాటిళ్లు వచ్చాయి. ఒక లారీలోని బాటిళ్లను మండపంలో దించారు. మరో లారీలోని సీసాలను సమీపంలోని దేవస్థానంలో దించారు. ఇదిలా ఉంటే వచ్చిన వాటర్ బాటిళ్లు, ఆహార పదార్థాలను స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు దగ్గరుండి పంపిణీ చేశారు.

ఆటోల ద్వారా తరలింపు

ఈ సందర్భంలోనే కొందరు చేతివాటం ప్రదర్శించినట్లు సమాచారం. వరద తగ్గిన తర్వాత బాధితులందరూ ఇళ్లకు చేరుకున్న అనంతరం దేవస్థానంలో ఉన్న బాటిళ్లను రాత్రి వేళ ఆటోల్లో పక్కదారి పట్టించినట్లు బలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇన్ని రోజులు గడిచిన తర్వాత ప్రత్యక్షంగా చూసిన వ్యక్తి మద్యం మత్తులో గురువారం రాత్రి సిమెంట్ గోడౌన్స్ సమీపంలో వాటర్ బాటిళ్ల పక్కదారి పట్టి అమ్మకాల వ్యవహారాన్ని బయట పెట్టడమే కాకుండా ఎక్కడికైనా వచ్చి చెబుతానని హడావుడి చేశాడు. దీంతో అక్కడ ఉన్న కొందరు తెలుగు తమ్ముళ్లు అతన్ని పక్కకు తీసుకెళ్లారు. ఈ తతంగమంతా చూస్తున్న స్థానికులు పక్కదారికి కాదేది అనర్హం అంటూ ముక్కున వేలేసుకున్నారు.

రైళ్లలో ల్యాప్‌టాప్‌లు చోరీ చేసిన నిందితుడి అరెస్ట్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైళ్లు, రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల నుంచి ల్యాప్‌టాప్‌లు చోరీ చేసిన నిందితుడిని విజయవాడ జీఆర్పీ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి అతని నుంచి రెండు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ వి.జె రమణ తెలిపిన వివరాల ప్రకారం రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా.. విజయవాడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో పార్వతీపురం జిల్లా పూటికవలస గ్రామానికి చెందిన తంగుడు రామకృష్ణ అనే యువకుడు ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగులను సోదా చేయగా అందులో రెండు ల్యాప్‌టాప్‌లు లభ్యమయ్యాయి. విచారణలో వాటిని రైళ్లలో ప్రయాణికుల నుంచి చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి రూ. 1.70 లక్షల విలువ చేసే ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.



ల్యాప్‌టాప్‌లు చోరీ చేసిన నిందితుడిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు